
సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
మంగళవారం । 16 । మే । 2023



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి నల్లా రామకృష్ణ వెంకట నాగ కుమార్ దంపతులు (ఉప్పలగుప్తం మండలం విలసవిల్లి) రూ.లక్ష విరాళం సమర్పించారు.



మిగులు జలాల విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి సోమవారం 7,232 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.10 అడుగులకు చేరింది.



కల చెదిరి.. వ్యథ మిగిలి...

తాళ్లరేవు ఆటో ప్రమాదంలో మృతి చెందిన మహిళలకు కుటుంబ సభ్యులు, బంధువులు సోమవారం యానాంలో కన్నీటి వీడ్కోలు పలికారు. - 8లో▸

న్యూస్‌రీల్

24న కొవ్వూరుకు సీఎం

ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్



ఏర్పాట్లపై ఆర్డీవోతో చర్చిస్తున్న కలెక్టర్ మాధవీలత, జేసీ ఎన్.తేజ్ భరత్‌లు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 24న తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు రానున్నారు. కలెక్టర్ కె.మాధవీలత ఈ విషయం తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె జేసీ ఎన్.తేజ్‌భరత్, ఇతర అధికారులతో కలిసి పట్టణంలో ముఖ్యమంత్రి బహిరంగ సభా ప్రాంగణం, హెలిప్యాడ్ ప్రాంతాలను పరిశీలించారు. 'వలంటీర్లకు వందనం' పేరుతో ఇక్కడ జరిగే రాష్ట్రవ్యాప్త అవార్డుల ప్రదాన కార్యక్రమంలో సీఎం పాల్గొంటారన్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో పట్టణంలో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రుద్రరాజు శ్రీనివాసరాజు (వెదిరేశ్వరం), ఎస్.వరప్రసాద్‌రెడ్డి, సునీత దంపతులు (ఊబలంక) సోమవారం చెరో రూ.10,116 చొప్పున విరాళాలు సమర్పించారు. గోశాలకు కరుటూరి వీర రాఘవులు (అంకంపాలెం) ట్రాక్టర్ గడ్డి అందించారు. దాతలకు స్వామి వారి చిత్రపటాన్ని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు అందజేశారు.

జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్‌గా మల్లికార్జున ప్రసాద్

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): జేఎన్‌టీయూకే అడ్మిషన్స్ డైరెక్టర్‌గా ఈసీఈ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ అడ్మిషన్స్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించిన ప్రొఫెసర్ కె.పద్మరాజు ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీగా నియమితులు కావడంతో ప్రసాద్‌ను ఆ స్థానంలో నియమించారు. ఆయనను వీసీ డాక్టర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ సుమలత అభినందించారు.

సత్యదేవునికి ఏకాదశి పూజలు



రత్నగిరిపై సత్యదేవుని దర్శనానికి క్యూలో నిల్చున్న భక్తులు

అన్నవరం: వైశాఖ బహుళ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రత్నగిరి దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం సత్యదేవునికి స్వర్ణ పుష్పాలు, లక్ష తులసి దళాలతో పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేదపండితులు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, అర్చకులు కంచిభొట్ల సాయికుమార్ తదితరులు పూజాదికాలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినం సందర్భంగా సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే ఆలయంలో రద్దీ నెలకొంది. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణలు చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. రెండు వేల మంది స్వామివారి వ్రతాలు ఆచరించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సుమారు ఐదు వేల మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

గంగపుత్రులకు లక్ష్మీ కటాక్షం



- నేడు వైఎస్సార్ మత్స్యకార భరోసా
- వేట నిషేధ పరిహారం అందజేయనున్న ప్రభుత్వం
- అర్హులకు రూ.10 వేల చొప్పున సాయం
- జిల్లాలో లబ్ధిదారులు 9,575 మంది
- అందిస్తున్న మొత్తం రూ.9.57 కోట్లు

సాక్షి, అమలాపురం: వైఎస్సార్ మత్స్యకార భరోసా నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయనుంది. సముద్రంలో చేపల వేట నిషేధం కారణంగా జీవనోపాధి కోల్పోయిన మత్స్యకారులను ఆదుకునేందుకు ఈ నిధులను ప్రభుత్వం ఏటా క్రమం తప్పకుండా అందిస్తున్న విషయం తెలిసిందే. అలాగే జిల్లాలో ఓఎన్‌జీసీ కార్యకలాపాల వల్ల నష్టపోయిన మత్స్యకారులకు కూడా భారీగా పరిహారం అందనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం మీట నొక్కి పరిహారం నిధులను అర్హుల ఖాతాల్లో జమ చేయనున్నారు. ఇదే సమయంలో జిల్లా వ్యాప్తంగా లబ్ధిదారులతో కాట్రేనికోన ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న స్థలంలో పరిహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడ మత్స్యకార లబ్ధిదారులనుద్దేశించి సీఎం జగన్ ప్రసంగించనున్నారు.

'మత్స్య క్రమబద్ధీకరణ చట్టం'లో భాగంగా గత నెల 15వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా సముద్రంలో వేట నిలిచిపోయింది. జూన్ 14 వరకూ 61 రోజుల పాటు వేట నిషేధం కొనసాగుతుంది. గతంలో 45 రోజులు మాత్రమే నిషేధం ఉండేది. నిషేధ సమయంలో చేపలు, ఇతర సముద్ర జీవుల పునరుత్పత్తి జరిగే అవకాశమున్నందున కోల్‌కతా నుంచి కన్యాకుమారి వరకూ వేటను కేంద్ర ప్రభుత్వం నిషేధిస్తుంది. దీని వల్ల వేలాది మంది మత్స్యకార కుటుంబాలకు జీవనోపాధి లేకుండా పోతోంది. జిల్లాలో ఏడు మండలాల్లో 45 సముద్ర తీర గ్రామాలున్నాయి. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం; మామిడికుదురు మండలం కరవాక; అల్లవరం మండలం ఓడలరేవు, నక్కా రామేశ్వరం; ఉప్పలగుప్తం మండలం వాసాలతిప్ప, ఎస్.యానాం; కాట్రేనికోన మండలం చిర్రయానాం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ; ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళతారు.

పెరిగిన లబ్ధిదారులు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ నాలుగేళ్లలో క్రమం తప్పకుండా ఏటా వేట నిషేధ పరిహారం పెరుగుతూండటం గమనార్హం.

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	వేట నిషేధ పరిహారం (రూ.లలో)
2019-20	5,244	5,24,40,000
2020-21	5,354	5,35,40,000
2021-22	8,861	8,86,10,000
2022-23	7,914	7,91,40,000
2023-24	9,575 (తొలి విడత)	9,57,50,000

ఆదుకుంటున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

రాష్ట్రంలో రెండు నెలల పాటు వేటకు దూరంగా ఉండే మత్స్యకారులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఆదుకుంటోంది. జిల్లాలో 1,700 బోట్లు వేటకు వెళ్లకుండా నిలిచిపోయాయి. ఒక్కో బోటు మీద ఆరుగురు మత్స్యకారులు ఉంటారని అంచనా. జిల్లా వ్యాప్తంగా 9,800 మందిని వైఎస్సార్ మత్స్యకార భరోసా లబ్ధిదారులుగా గుర్తించారు. వీరిలో 9,575 మందికి మాత్రమే ఈ-కేవైసీ పూర్తయ్యింది. తొలి విడతగా రూ.9.57 కోట్ల పరిహారం వారి ఖాతాల్లో జమ చేయనున్నారు. మిగిలిన వారికి తరువాత అందించనున్నారు.

టీడీపీ హయాంలో అరకొర పరిహారం

వేట నిషేధ పరిహారానికి గత టీడీపీ హయాంలో మొత్తం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అంతా కలిపి 12 వేల మంది మాత్రమే లబ్ధిదారులు ఉండేవారు. అప్పట్లో కేవలం రూ.4 వేల పరిహారం ఇచ్చేవారు. అది కూడా వేట నిషేధ కాలం పూర్తయిన మూడు నాలుగు నెలలకు అందించేవారు. ఇప్పుడు ఇదే ఉమ్మడి తూర్పు గోదావరి పరిధిలోని కాకినాడ జిల్లాలో 24,147, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 9,800, తూర్పు గోదావరి జిల్లాలో 310 మంది చొప్పున మొత్తం 34,257 మందికి వేట నిషేధ పరిహారం అందనుంది. అది కూడా వేట నిషేధ సమయంలోనే అందిస్తూండటం విశేషం.

అర్హులందరికీ లబ్ధి



అర్హులైన ప్రతి లబ్ధిదారునికీ మేలు చేయాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వేట నిషేధం వల్ల నష్టపోతున్న వారిని గుర్తించి జాబితా రూపొందించాం. వారికి ఈ-కేవైసీ పూర్తి చేశాం. ప్రతి లబ్ధిదారుని ఖాతాలో వేట నిషేధ పరిహారం నేరుగా జమ కానుంది. మిగిలిన లబ్ధిదారుల ఈ-కేవైసీ సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, వారి ఖాతాల్లో పరిహారం సొమ్ములు పడేలా చూస్తాం.

– షేక్ లాల్ మహ్మద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

16,408 మందికి రూ.75.47 కోట్ల ఓఎన్‌జీసీ పరిహారం



కృష్ణా – గోదావరి (కేజీ) బేసిన్‌లో ఓఎన్‌జీసీ, ఇతర చమురు సంస్థల కార్యకలాపాల వల్ల మత్స్యకారుల వేట తగ్గిపోతోంది. సముద్రం, గోదావరి నదీ పాయల్లో వేట తగ్గడం వల్ల మత్స్యకారులు నష్టపోతున్నారు. దీనిని గుర్తించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఓఎన్‌జీసీ నుంచి మత్స్యకారులకు పరిహారం ఇప్పిస్తోంది. జిల్లాలో ఇప్పటి వరకూ రెండు సార్లు పరిహారం ఇప్పించగా, మంగళవారం మూడో విడతగా జిల్లాలోని 16,408 మందికి రూ.75.47 కోట్లు అందించనున్నారు.

తాళ్లరేవు మండలంలో..

తాళ్లరేవు మండలంలో ఓఎన్‌జీసీ పైపులైను పనుల వల్ల 7,050 మంది మత్స్యకారులు ఉపాధి కోల్పోయారు. వారికి నెలకు రూ.11,500 చొప్పున 4 నెలలకు రూ.46 వేలు జమ చేయనున్నారు. ఈ మేరకు రూ.32.43 కోట్ల మేర పరిహారాన్ని అందించనున్నారు.

అపర భగీరథుడు.. సర్ ఆర్థర్ కాటన్



కాటన్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న త్రినాథరెడ్డి, నరేన్ తదితరులు

రామచంద్రపురం: గోదావరి జలాలను ఒడిసిపట్టి, ఉభయ గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన సర్ ఆర్థర్ కాటన్ అపర భగీరథుడని వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి కొవ్వూరి త్రినాథరెడ్డి కొనియాడారు. కాటన్ దొర జయంతి సందర్భంగా పట్టణంలోని జలవనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయంలో ఆ మహనీయుని విగ్రహం వద్ద త్రినాథరెడ్డి ఆధ్వర్యాన సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సత్తి వెంకటరెడ్డి, ఈఈ పి.విజయగోపాల్, డిప్యూటీ ఈఈ వీవీవీ రామకృష్ణ, ఏఈ జేవీఎల్ నాగరాజు తదితరులు కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా త్రినాథరెడ్డి మాట్లాడుతూ, భారతదేశం సుభిక్షంగా ఉండాటానికి నదుల అనుసంధానం జరగాలని కాటన్ ఆకాంక్షించేవారన్నారు. తక్కువ ఖర్చుతో నదులను అనుసంధానం చేయగలిగే గార్లెండింగ్ ఆఫ్ ఇండియా మ్యాప్ రూపొందించిన విశిష్ట వ్యక్తి కాటన్ అని అన్నారు. ఈ ప్రాంతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అన్నపూర్ణగా.. దక్షిణ భారతదేశ ధాన్యాగారంగా చిర కీర్తిని పొందడానికి మూలకారకుడు సర్ ఆర్థర్ కాటన్ అని చెప్పారు. కార్యక్రమంలో ఏఈలు జీఎస్ ప్రవీణ్ మాధవ్, వి.సుజాత, మల్లిడి రామారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి, గుణ్ణం వెంకటేశ్వరరావు, రైతులు, ఇరిగేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యుడు మండే



అమలాపురంలో నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

- అగ్నిగుండంలా మారిన వాతావరణం
- ఉదయం 10 గంటలకే ఉష్ణతాపం
- వేడి గాలులతో జనం హడల్
- నిర్మానుష్యంగా ప్రధాన రహదారులు
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నింగిలోని సూర్యుడు ఒక్కసారిగా భగ్గుమన్నాడు. నింగి నుంచి నిప్పుల వర్షం కురిపించాడు. కొద్ది రోజులుగా చండప్రచండంగా చెలరేగుతున్న మార్తాండుడు.. సోమవారం మరింత ఉగ్రరూపమెత్తాడు. ఫలితంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అగ్నిగుండంగా మారింది. బంగాళాఖాతంలో ఇటీవల ఏర్పడిన మోకా తుపాను ప్రభావంతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దీంతో ప్రజలు ఆపసోపాలు పడుతున్నారు. ఈ నెల 11న పెద్ద కత్తెర ప్రారంభమైనప్పటి నుంచీ ఉష్ణోగ్రతల్లో గణనీయంగా పెరుగుదల నమోదవుతోంది. ఈ నెల 25న రోహిణీ కార్తె ప్రారంభం కానుంది. అయితే, ఇప్పుడే రోహిణి వచ్చేసినట్టు ఎండలు మండిపోతున్నాయి. ఉష్ణతీవ్రత ఒక్కసారిగా పెరిగిపోవడంతో జనం హడలెత్తుతున్నారు. అత్యవసరమైతే తప్ప గుమ్మం దాటి బయటకు వచ్చే సాహసం చేయలేకపోతున్నారు. బయట పనులుంటే చాలామంది ఉదయం 10 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తరువాత మాత్రమే వెళ్తున్నారు. మధ్యాహ్నం పూట చాలా వరకూ ప్రయాణాలు మానుకుంటున్నారు. చాలాచోట్ల సాయంత్రం వరకూ రోడ్లన్నీ దాదాపు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ఉష్ణోగ్రతలు (డిగ్రీల సెల్సియస్‌లో)

నగరం/పట్టణం	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	44.0	28.0
అమలాపురం	43.4	28.0
కాకినాడ	42.8	28.3

కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో వీస్తున్న వేడిగాలులు ప్రజలకు కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. రాత్రయినా గాలుల్లో వేడి తగ్గకపోవడంతో వారు నానా ఇబ్బందులూ పడుతున్నారు. సముద్ర తీరాన ఉన్న కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 5 గంటల తరువాత వాతావరణం కాస్త చల్లబడుతోంది. గోదావరి నదికి అటు, ఇటు ఉన్న తూర్పు గోదావరి జిల్లాలో రాజమహేంద్రవరం, కొవ్వూరు, నిడదవోలు తదితర ప్రాంతాల ప్రజలు ఎండ వేడి, ఉక్కపోత, వడగాడ్పులతో ఆపసోపాలు పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి



అధిక ఉష్ణోగ్రతలపై ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేస్తోంది. వడదెబ్బ నివారణ జాగ్రత్తలను ప్రజలకు వివరిస్తున్నాం. శరీర ఉష్ణోగ్రతలు 105.1 ఫారిన్‌హీట్ కంటే ఎక్కువ ఉండటం, చర్మం పొడిబారడం వంటి లక్షణాలున్న వారు మంచినీరు ఎక్కువగా తాగాలి. అటువంటి వారు ఎండలో ఎక్కువగా తిరగకుండా వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి. ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువసార్లు తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వడదెబ్బ తగలకుండా మరింత అప్రమత్తంగా ఉండాలి. ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వీలైనంత వరకూ ఇంట్లోనే ఉండాలి.

– ఆర్.రమేష్, డీఎంహెచ్‌ఓ, కాకినాడ

వ్యాపారాలపై ఉష్ణ ఘాతం

ఎండల తీవ్రత అన్ని రంగాలనూ ప్రభావితం చేస్తోంది. మండిపోతున్న ఎండలతో వివిధ పట్టణాలతో పాటు గ్రామాల్లో రోడ్ల వెంబడి తోపుడు బండ్లు, తాటియాకు పాకల్లో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారు తమ ఉపాధి దెబ్బ తింటోందని వాపోతున్నారు. తెల్లవారకుండానే మోటార్ సైకిళ్లు, సైకిళ్లపై కడియం, ఆలమూరు, రావులపాలెం, రాజానగరం, కోరుకొండ, సీతానగరం తదితర మండలాల్లోని పల్లెల నుంచి కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, దానిమ్మ, పనస, అరటి పండ్లు, జామకాయలు, బొప్పాయి, దోసకాయల వంటి వ్యాపారాలు చేసుకునే చిరు వ్యాపారులు ఎండల తీవ్రతతో బెంబేలెత్తిపోతున్నారు. బతుకుతెరువు కోసం అనివార్యంగా రోడ్డు మీదకు వస్తున్నా.. ఎండలు తీవ్ర రూపం దాల్చకముందే అమ్మకాలు ముగించేసి ఇంటి దారి పడుతున్నారు.

అమ్మకాలు పడిపోయాయి



వడగాల్పులతో ఉదయం 10 గంటలకే ఎవరూ బయటకు రాకపోవడంతో అమ్మకాలు పడిపోయాయి. వారం రోజులుగా పెట్టుబడి కూడా దక్కడం లేదు. దిక్కుతోచని స్థితిలో ఉన్నాం. ఎండలకు భయపడి ఉదయం నుంచి సాయంత్రం వరకూ దుకాణాలు మూసేసి, సాయంత్రం ఐదు, ఆరు గంటల మధ్య మాత్రమే తెరుస్తున్నాం. ఆ గంట, గంటన్నర ఎంత అమ్మితే అంతతోనే సరిపెట్టుకుంటున్నాం. ఎండల తీవ్రతకు పూలు వాడిపోయి నష్టపోతున్నాం.

– కొల్లి శ్రీనివాస్, పూల వ్యాపారి, మండపేట

స్పందనకు 171 అర్జీలు



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ధ్యానచంద్ర

అమలాపురం రూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు 171 అర్జీలు సమర్పించారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు అర్జీలు స్వీకరించారు. కొందరికి తక్షణమే పరిష్కారం చూపగా, మరికొన్నింటిపై పరిశీలన, విచారణకు ఆదేశించారు. అనంతరం జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ, స్పందన అర్జీలను అత్యంత నాణ్యతతో పరిష్కరించాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం చూపరాదని అధికారులను ఆదేశించారు. స్పందనలో పరిష్కారానికి నోచని సమస్యలను 1902కు కాల్ చేసి నేరుగా ముఖ్యమంత్రికి విన్నవించే అవకాశం ఉందని గుర్తు చేశారు. గడువు తీరిన అర్జీలు పెండింగ్‌లో ఉంటే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. 'జగనన్నకు చెబుదాం' పోర్టల్‌లో వచ్చే అర్జీలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

పర్యావరణహిత జీవన శైలి అలవరచుకోవాలి

కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ హిత జీవనశైలిపై కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు రూపొందించిన 'మిషన్ లైఫ్' కార్యక్రమంపై జిల్లా అటవీ అధికారి ప్రసాదరావు జిల్లా అధికారులకు వివరించారు. జేసీ ధ్యానచంద్ర మాట్లాడుతూ, ప్రజలందరూ పర్యావరణ జీవన శైలిని అలవరచుకోవాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణకు తమ దినచర్యలో సాధ్యమైనన్ని మార్పులు చేసుకుంటామని అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా అధికారులకు సూచించారు. జాతీయ డెంగీ డే సందర్భంగా జాతీయ కీటక జనిత వ్యాధి నియంత్రణ కార్యక్రమంలో భాగంగా డెంగీ వ్యాధి లక్షణాలపై జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ దుర్గారావుదొర, డీఈఓ కమల కుమారి, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, జిల్లా పశు సంవర్ధక అధికారి జైపాల్, ఇతర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు స్పందనకు 36 అర్జీలు

అమలాపురం టౌన్: ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు 36 అర్జీలు వచ్చాయి. ఎస్పీ సుసరాపు శ్రీధర్, ఏఎస్పీ కె.లతామాధురి ఈ కార్యక్రమం జరిగింది. కొన్ని అర్జీలను ఎస్పీ, ఏఎస్పీలు అక్కడికక్కడే పరిష్కరిస్తూ ఆయా పోలీసు స్టేషన్ల ఎస్సైలతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్పీ కార్యాలయం స్పెషల్ బ్రాంచి సీఐ కోలా రజనీకుమార్, ఎస్సై గంగాభవాని కూడా పాల్గొన్నారు.

ప్రమాదాల కట్టడికి బ్లాక్‌స్పాట్‌లపై దృష్టి

కాకినాడ జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రధానంగా బ్లాక్‌స్పాట్‌లపై దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని కాకినాడ కలెక్టర్ కృతికా శుక్లా వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా రహదారి భద్రత కమిటీ (డీఆర్‌ఎస్‌సీ) సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ, మీడియన్లు, సెంట్రల్ డివైడింగ్ లైటింగ్ సిస్టమ్, హైమాస్ట్ లైటింగ్ టవర్, అప్రోచ్ రోడ్ స్పీడ్ బ్రేకర్ల వంటివి లేకపోవడంతో జాతీయ రహదారులపై ప్రమాదాలు సంభవిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల మధ్య ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని తేలిందన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగితే సంయుక్త కమిటీ తనిఖీ చేసి, సమగ్ర నివేదిక అందజేయాలన్నారు. ఇంజినీరింగ్ పరంగా లోపాలుంటే సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పీడ్ బ్రేకర్లు, సైన్ బోర్డులు, హెచ్చరిక బోర్డులు, స్పీడ్ లిమిట్ బోర్డులు, రబ్బర్ స్టిక్కర్ల వంటివి ఏర్పాటు చేయాలన్నారు. ప్రమాదాలను తగ్గించేందుకు భవిష్యత్తులో తీసుకోనున్న చర్యలను ఎస్పీ సతీష్‌కుమార్ వివరించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డుకట్ట

గంజాయి, మాదకద్రవ్యాలకు అడ్డుకట్ట వేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన నార్కో సమన్వయ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. గంజాయిపై సమాచారం అందించేందుకు 14500 టోల్‌ఫ్రీ నంబర్ అందుబాటులో ఉందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలోనూ ఈ నంబర్ ప్రదర్శించాలన్నారు.



జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా

ఎండుగడ్డి ఒబ్బిడి చేస్తూ
యువకుడి మృతి


మృతుడు ప్రసాద్ (పాత చిత్రం)

అల్లవరం: ఓ యువకుడు పొలంలో ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందా డు. తహసీల్దార్ సాంబశివప్రసాద్ కథనం ప్రకారం.. కపిలేశ్వరపురం మండలం టేకి గ్రామానికి చెందిన కాజూలూరి ప్రసాద్ (27) అల్లవరం మండలం ఎంట్రుకోనలో నివాసం ఉంటున్నా డు. ఆదివారం మధ్యాహ్నం వరకూ తాపీపని చేసి, ఇంటికి వచ్చాడు. పశువులకు ఎండు గడ్డిని ఒబ్బిడి చేసేందుకు పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అప్పటికే ప్రసాద్ మృతి చెందాడు. తహసీల్దార్ సాంబశివ ప్రసాద్, వైద్యాధికారి సుమ, ఎస్సై శ్రీనునాయక్‌లు మృతదేహాన్ని పరిశీలించారు. ప్రసాద్ వడదెబ్బ లేదా మరేదైనా కారణం ఉందా అనేది పోస్టుమార్టంలో నిర్ధారించాల్సి ఉందని తహసీల్దార్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కల చెదిరి.. వ్యధ మిగిలి..

- తాళ్లరేవు ఆటో ప్రమాద మృతులకు కడసారి వీడ్కోలు
- గుండెలు పగిలేలా విలపించిన కుటుంబ సభ్యులు
- ఓదార్చిన ఎమ్మెల్యే అశోక్, మల్లాడి
- బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయానికి హామీ

యానాం/కాకినాడ క్రైం/తాళ్లరేవు: కష్టపడి సంపాదించుకుని.. మెరుగైన జీవితం గడపాలని ఒకరు.. కుమార్తె వివాహం చేయాలని మరొకరు.. బిడ్డలను మంచి చదువులు చదివించి, ప్రయోజకుల్ని చేయాలని ఇంకొకరు.. ఇలా ఆ కుటుంబాలు కన్న కలలు కళ్ల ముందే చెదిరిపోయాయి.. కన్నీటినే మిగిల్చాయి.. తాళ్లరేవు ఆటో ప్రమాదంలో మృతి చెందిన యానాం మహిళల కుటుంబాల్లో సోమవారం నెలకొన్న విషాద భరిత దృశ్యమిది. తాళ్లరేవు - యానాం మధ్య సుబ్బారాయుని దిమ్మ ప్రాంతంలో 216 జాతీయ రహదారిపై ఆదివారం మధ్యాహ్నం ఆటోను ప్రైవేటు బస్సు ఢీకొన్న ఘోర ప్రమాదంలో యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన ఏడుగురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలకు కాకినాడ జీజీహెచ్ వైద్యులు సోమవారం పోస్టుమార్టం పూర్తి చేశారు. తలకు తీవ్ర గాయాలు కావడం వల్లనే ఈ మహిళలందరూ మృతి చెందారని వైద్యులు వెల్లడించారు. మృతుల్లో ఒక మహిళకు కాళ్లు తెగిపోయాయని, ఇద్దరికి పక్కటెముకలు నుజ్జునుజ్జయ్యాయని తెలిపారు. యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, ఢిల్లీలో పుదుచ్చేరి ప్రభుత్వ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి, కాకినాడ రూరల్ సీఐ శ్రీనివాస్, పెదపూడి, కోరంగి ఎస్సైలు వాసు, పి.శ్రీనివాస్ కుమార్ తదితరులు ఉదయం నుంచీ కాకినాడ జీజీహెచ్ మార్చురీ వద్దనే ఉన్నారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ధైర్యం చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ప్రత్యేక వాహనాల్లో యానాం తీసుకువచ్చి, ఘన నివాళులర్పించారు. బూడపనీటి సత్యవతి (బాలయోగి నగర్), కల్లి పద్మ (కొత్తబస్టాండ్ వెంకట్‌నగర్), బొక్కా అనంతలక్ష్మి (ఫ్రాన్స్ తిప్ప), చెందిన శేశెట్టి వెంకటలక్ష్మి (మెట్టకూరు), నిమ్మకాయల వెంకటలక్ష్మి (కురసాంపేట), చింతపల్లి జ్యోతి (వెంకట్ నగర్) మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం కుటుంబ సభ్యులు, బంధువుల రోదనల నడుమ స్థానిక టైడల్ లాక్ సమీపాన హిందూ శ్మశాన వాటిక, మెట్టకూరు శ్మశాన వాటికల్లో ఆ మహిళల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించారు. మృతుల ఇళ్ల వద్దకు పెద్ద సంఖ్యలో జనాలు తరలివచ్చి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. హిందూ శ్మశాన వాటిక వద్ద మృతదేహాలకు మల్లాడి కృష్ణారావు, ఆర్ఏఓ మునిస్వామి కడసారి నివాళులర్పించారు.


సత్యవతి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు


పద్మ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మల్లాడి కృష్ణారావు తదితరులు


మృతదేహాలను తరలిస్తున్న యానాం ఎమ్మెల్యే అశోక్

మద్యం మత్తులోనే ప్రమాదం!

మద్యం మత్తు కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. డీజిల్ నింపుకొనేందుకు కాకినాడ నుంచి యానాం పట్టణానికి మోజో ట్రావెల్స్ బస్సును డ్రైవర్, క్లీనర్ తీసుకువచ్చారు. డీజిల్ నింపుకొన్న అనంతరం వారు మద్యం తాగినట్టు సమాచారం. ప్రమాద సమయానికి ఆ ఆ బస్సును డ్రైవర్‌కు బదులు క్లీనర్ నడుపుతున్నట్టు తెలిసింది. మద్యం మత్తులో బస్సును అదుపు చేయలేక, పక్కనే ఉన్న రెయిలింగ్‌ను, అనంతరం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పరిమితికి మించి మహిళా కార్మికులను ఎక్కించుకున్న ఆటో డ్రైవర్ గిడ్డి వెంకటేశ్వరరావుపై కూడా కేసు నమోదు చేయనున్నట్టు తెలిసింది.

అధైర్యం వద్దు.. ఆదుకుంటాం

మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకుంటామని, ఎవ్వరూ అధైర్యపడొద్దని, ఎక్కువ మొత్తంలో ఆర్థిక సహాయం వచ్చేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే శ్రీనివాస్ అశోక్ అన్నారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఇప్పటికే పుదుచ్చేరి ప్రభుత్వం మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున తక్షణ ఆర్థిక సహాయం ప్రకటించిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా, వ్యక్తిగతంగా తాను ఒక్కో మృతురాలి కుటుంబానికి రూ.లక్ష చొప్పున రూ.7 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని చెప్పారు. మృతులకు రొయ్యల ఫ్యాక్టరీ నుంచి బీమా ఉందని, దీంతోపాటు వారు సైతం ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఇవ్వనున్నారని తెలిపారు. ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు యాజమాన్యంతో తాను మాట్లాడానని, వారి నుంచి సైతం రూ.3 లక్షల చొప్పున సహాయం అందుతుందని చెప్పారు. దీనిపై ఇప్పటికే అధికారులు సైతం చర్చిస్తున్నారన్నారు. అలాగే, మల్లాడి కృష్ణారావు కూడా వ్యక్తిగతంగా రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారని తెలిపారు. దీంతోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి సైతం మరింత సహాయం అందేలా చర్యలు చేపట్టామని అశోక్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఎవ్వరైనా బాధిత కుటుంబాలను స్వచ్ఛందంగా ఆదుకోవచ్చని అన్నారు. మొత్తం మీద ఒక్కో కుటుంబానికి రూ.12 లక్షల నుంచి రూ.13 లక్షల వరకూ సహాయం అందే అవకాశం ఉందని చెప్పారు. అలాగే క్షతగాత్రులు ఒక్కొక్కరికి రూ.30 వేల చొప్పున అందిస్తామన్నారు. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరి పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉందని, వారికి మరింత మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు.

ఇద్దరిపై కేసు

ఈ ప్రమాదానికి సంబంధించి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కోరంగి ఎస్సై పి.శ్రీనివాస కుమార్ తెలిపారు. బస్సును నిర్లక్ష్యంగా నడిపి, ఏడుగురి మృతికి, మరో ఏడుగురు గాయపడేందుకు కారకుడైన బస్సు డ్రైవర్ వేగిరాజు సుధీర్, క్లీనర్ ముంగమూరి మహేష్‌లపై కాకినాడ డీఎస్పీ మురళీ కృష్ణారెడ్డి ఆదేశాల మేరకు 304, 337, 338 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. నిందితులిద్దరినీ అరెస్టు చేసి, కోర్టుకు తరలించామన్నారు.

ఎమ్మెల్సీగా కుడుపూడి ప్రమాణ స్వీకారం


అమరావతిలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేస్తున్న సూర్యనారాయణరావు


ప్రమాణ స్వీకారం అనంతరం జిల్లా వైఎస్సార్ సీపీ నేతలతో సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్ కుడుపూడి సూర్యనారాయణరావు అమరావతిలో సోమవారం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇటీవల ఆయన ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం తెలిసిందే. ఆయన ప్రమాణ స్వీకారోత్సవానికి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పార్టీ శ్రేణులు, బీసీ నేతలు సోమవారం తరలివెళ్లారు. ప్రమాణ స్వీకారం చేసే సమయంలో ×జై సూరి¥ అంటూ నినాదాలు చేశారు. రాష్ట్ర దృశ్యకళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్యశైలజ, అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పార్టీ అమలాపురం అధ్యక్షుడు సంసాని బులినాని, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, అయినవిల్లి జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు, ఉభయ గోదావరి జిల్లాల బీసీ సంఘాల నేతలు కోడి దుర్గాప్రసాద్, కుక్కల శ్రీనివాసరావు, వాసంశెట్టి తాతాజీ, కుడుపూడి త్రినాథ్, కాంగ్రెగుల గోపి తదితరులు అమరావతి వెళ్లారు.

నేడు 40 కిలోమీటర్ల మేర ఊరేగింపు

ఎమ్మెల్సీగా ప్రమాణం స్వీకారం చేసిన అనంతరం కుడుపూడి సూర్యనారాయణరావు తొలిసారిగా మంగళవారం మధ్యాహ్నం జిల్లాకు రానున్నారని వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు భారీ ఊరేగింపుతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరిగాయని చెప్పారు. రావులపాలెం మండలం గోపాలపురంలోని కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాసం నుంచి మధ్యాహ్నం 2 గంటలకు ఊరేగింపు మొదలవుతుందన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి ఊరేగింపు వాహనంపై మంత్రులు పినిపే విశ్వరూప్, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆశీనులవుతారని వివరించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, బీసీ నాయకులు పాల్గొని ఈ ఊరేగింపును విజయవంతం చేయాలని బులినాని విజ్ఞప్తి చేశారు.

ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చరల్ కోర్సులలో ప్రవేశాలకు నిర్వహించే ఈఏపీ సెట్ ఆన్‌లైన్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అడ్మిషన్లు ఆలస్యం కాకుండా ఈసారి రెండు నెలలు ముందుగానే ఈ పరీక్షలు ప్రారంభించారు. కోనసీమ జిల్లాలో 658, కాకినాడ జిల్లాలో 1,120, తూర్పు గోదావరి జిల్లాలో 1,333 మంది ఈ పరీక్షలకు హాజరయ్యారు.

యువతి ఆత్మహత్య


బావని (పాతచిత్రం)

సామర్లకోట: స్థానిక సాయి నగర్‌కు చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకుంది. సీఐ కె.దుర్గాప్రసాద్ కథనం ప్రకారం.. బుద్దల బావని (20) బీఎస్సీ కంప్యూటర్స్ చదివింది. చెన్నై విప్రో కంపెనీలో ఉద్యోగం వచ్చింది. 45 రోజుల శిక్షణ అనంతరం హైదరాబాద్‌లో నియమించారు. వారం రోజులు పని చేశాక కోయంబత్తూరుకు బదిలీ చేశారు. తనకు ఆరోగ్యం సహకరించదని, అంత దూరం వెళ్లలేనని బావని బదులిచ్చింది. కంపెనీ ప్రతినిధులు ససేమిరా అనడంతో తల్లిదండ్రులతో చర్చించేందుకు ఆమె సామర్లకోట వచ్చింది. నాలుగు రోజులుగా మనోవేదనకు గురవుతున్న ఆమె సోమవారం ఇంట్లో చెదల నివారణ మందు తాగి, ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తండ్రి జగ్గరాజు ఫిర్యాదు మేరకు సీఐ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లైంగిక దాడి కేసులో నలుగురి అరెస్ట్

ఆత్రేయపురం: మండలంలోని అంకంపాలేనికి చెందిన బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో నలుగురిని సోమవారం అరెస్టు చేసినట్టు ఎస్సై సీహెచ్ సుధాకర్ తెలిపారు. ఈ నెల 8న బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన యాళ్ల జీవన్‌కుమార్ కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేశారు. రావులపాలెం సీఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి కొత్తపేట కోర్టుకు తరలించినట్టు ఎస్సై తెలిపారు.